కనులపండువగా గోదా రంగనాథుల కల్యాణం



లలితాపీఠంలో గోదాదేవి కల్యాణం జరిపిస్తునన అర్చకులు



వేదికపై ఉత్సవమూర్తులు



కల్యాణోత్సవాల్లో కేకే రాజు, అల్లు శంకరరావు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణోత్సవం ఆదివారం కనులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో వైభవునికి ఉదయాస్తమాన సేవ నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భోగి కావడంతో భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. మహిళలు సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు వేసి సంక్రాంతి లక్ష్మికి ఆహ్వానం పలికారు. గోదాదేవిని మేళతాళాల మధ్య ఆలయ ప్రదక్షిణ చేయించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం తిరుప్పావై సేవా కాలంలో భాగంగా పాశుర విన్నపం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు అనంతరం శ్రీదేవి భూదేవి సమేతుడైన వైభవుడితోపాటు గోదాదేవి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఉత్తర ద్వారం సమీపంలో నిర్మించిన ప్రత్యేక వేదిక వద్దకు తోడ్కొని వచ్చి గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. గోదా రంగనాథులకు కేకే రాజు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు వాసు, శేషు స్వామి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం

సీతంపేట: నెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలు గోదా రంగనాథుల కల్యాణంతో ముగిశాయి. ధనుర్మాసం ఆఖరి రోజైన భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోదా దేవి, రంగనాథుల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. మంగళధ్వని, పండితుల వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- అక్కయ్యపాలెం పరిధి శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం గోదాదేవి, రంగనాథుల కల్యాణం ఘనంగా జరిపించారు. ఆలయ అర్చకులు నంబాళ వేంకట కూర్మాచార్యులు గోదా, రంగనాథుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సుముహూర్తం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలు కళ్లకు కట్టినట్టు వేడుకగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు సతీసమేతంగా పాల్గొని కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు అందజేశారు. సీతంపేట రాధాకృష్ణ ఆలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు.



శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం



కల్యాణోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

జోరుగా గాలిపటాల విక్రయాలు



శంకరమఠం రోడ్డులో విక్రయిస్తున్న గాలి పటాలు

సీతంపేట: సంక్రాంతి పండగ అంటే పిల్లలకు గుర్తొచ్చేది గాలి పటాలు. పండగ సెలవుల్లో గాలిపటాలు ఎగురవేయడానికి పిల్లలు ఉత్సాహం చూపిస్తుంటారు. పిల్లలను ఆకర్షించేలా వివిధ రంగులు, డిజైన్లలో పతంగులను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. శంకరమఠం రోడ్డు, అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో రోడ్డు పక్కన ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. పేపర్, పాలథిన్, క్లాత్‌తో తయారు చేసిన మూడు రకాల గాలిపటాలు అమ్ముతున్నారు. గబ్బిలం, గద్ద , బటర్‌ఫ్లై, ఏంజిల్, గుడ్లగూబ, రామచిలుక ఆకారాలలో క్లాత్‌తో తయారు చేసిన గాలి పటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బెన్‌టెన్, స్పైడర్‌మ్యాన్, డోరేమాన్, చోటాభీం, టామ్ అండ్ జెర్రీ, సినీతారల ముఖచిత్రాలతో తయారు చేసిన గాలిపటాలు ఆకర్షిస్తున్నాయి. రూ.5ల నుంచి రూ.300 ధరలతో వీటిని విక్రయిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అప్పన్నపాలెం వద్ద బీఆర్‌టీఎస్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందింది. కుటుంబానికి ఆధారంగా ఉన్న మహిళ మృతి వార్త తెలుసుకుని అప్పన్నపాలెం వాసులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు.పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. అప్పన్నపాలెంలో నివాసం ఉంటున్న గొలగాని అప్పలకొండ(57) స్థానికంగా పలు ఇళ్లలో పని చేస్తుంది. భర్త అప్పారావు, కొడుకు, కూతరుతో అప్పన్నపాలెంలో నివాసం ఉంటోంది. భర్త అప్పారావు నడవలేని స్థితిలో ఉంటున్నాడు. కొడుగు డిగ్రీ పూర్తిచేశాడు. కూతరు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇళ్లలో పనిచేస్తూ కుటుంబానికి అప్పలకొండ ఆధారంగా ఉంది. కాగా ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో అప్పన్నపాలెం వద్ద అప్పలకొండ రోడ్డు దాటుతుండగా బీఆర్‌టీఎస్ రోడ్డులో పాత గోశాల నుంచి వేపగుంట వైపు వెళ్తున్న ఆర్టీసీబస్ ఆమెను ఢీకొట్టింది. టైరు కింద పడిపోవడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అప్పలకొండ బంధవులు, అప్పన్నపాలెం నివాసితులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి



శోభన్‌బాబు విగ్రహం వద్ద క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అభిమానులు

కంచరపాలెం: అందరూ సమాజసేవలో భాగస్వాములు కావాలని సిటీ వైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుడు కొణతాల వెంకటరావు సూచించారు. కంచరపాలెం పరిధి రామ్మూర్తి పంతులుపేటలో శోభన్‌బాబు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. సంఘం తరపున చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శోభన్‌బాబు చిత్రంతో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్ అవిష్కరించారు. కార్యక్రమంలో కొణతాల చిన్న, డీఎస్ విజయకుమార్, ఎం.సూర్యనారాయణ, పల్లా పైడిరాజు యాదవ్, జి.ఫణిభూషణరావు, కె.సూర్యరత్నం, పి.దేవకి, టి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలతో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు బోగవిల్లి గోవింద్

సీతంపేట: సంక్రాంతి సందర్భంగా స్థానిక హరిజన వీధిలో గాంధీ హరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు బోగవిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో జామి శోభ, మంగ, జోరీగల రాంబాయి నిలిచారు. కార్యక్రమంలో మంచిపిల్లి లక్ష్మణరావు, జామి శివ, కె.ఎస్.ఎన్.రెడ్డి, వినయ్, అఖిల్, పిల్లి పవన్, కనక, అప్పరాజు ,స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేడు ప్రసన్న వినాయక తీర్థం



ప్రసన్న వినాయక స్వామి

కంచరపాలెం: స్థానిక జాషువానగర్‌లో సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం ప్రసన్న వినాయక దేవాలయం వద్ద తీర్థం (పరస) నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మిడి అచ్చిబాబు తెలిపారు. ఈ సందర్భంగా నేలవేషాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, పలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తీర్థం సందర్భంగా ప్రసన్న వినాయకున్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు అచ్చిబాబు తెలిపారు.

తిక్కవానిపాలెం గ్రామ సంఘం అధ్యక్షుడిగా వాసుదేవరావు



నూతన అధ్యక్షుడు వాసుదేవరావుతో సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం గ్రామ సంఘం అధ్యక్షుడిగా ఉమ్మిడి వాసుదేవరావు ఎన్నికైనట్టు వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గంటా కామరాజు తెలిపారు. 2024–25 సంవత్సరానికి జరిగిన ఎన్నికల్లో వాసుదేవరావు గెలుపొందారని చెప్పారు. ఈ మేరకు ఆదివారం వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అధ్యక్షుడు వాసుదేవరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో శీరం పోలరాజు, కర్రి రమణ, గరికిని శ్రీనివాసరావు, వంకా అప్పారావు పాల్గొన్నారు.

రైతు బజార్లు కిటకిట



కంచరపాలెం రైతుబజారులో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



రద్దీగా ఉన్న సీతమ్మధార రైతుబజారు

కంచరపాలెం/సీతమ్మధార : కంచరపాలెం, సీతమ్మధార రైతు బజార్లు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. దేవ గుమ్మడి, చెరకు గడలు, కూర పెండలం, చిలగడ దుంపలతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరలు, పూజ సామగ్రి, పండ్లు, పువ్వులు, పసుపుకుంకుం, ఆకులు, వక్కలు, కొబ్బరికాయల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. కొనుగోలు దారులతో రైతు బజార్లు సందడిగా మారాయి. అల్లూరి,అనకాపల్లి జిల్లాల్లోని అరకు, కృష్ణదేవిపేట, నర్సీపట్నం, దేవరాపల్లి సబ్బవరం, కొత్తవలసతో పాటు రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి దుంపలు, చెరకు గడలను విక్రయానికి భారీగా తీసుకువచ్చారు. రైతులు ఎక్కువ ధరలకు అమ్మకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. సీతమ్మదార రైతు బజారులో ఎస్టేట్ అధికారి కొండబాబు, సతీష్ సీసీకెమెరాల ద్వారా పర్యవేక్షించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితులను గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు (డీఎస్ఆర్పీ) బి.మోహన్‌రావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ టి.కామేశ్వరరావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ చిట్టిబాబు సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కర్ణాటకకు చెందిన గోవర్ధన్ (19), ఒడిశాకు చెందిన సాధూరామ్(43) బ్యాగు తనిఖీ చేయగా 5.5 కేజీల గంజాయి లభించింది. వీరిద్దరూ కోరాపుట్ నుంచి విశాఖపట్నం మీదుగా రైలులో బెంగళూరు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లిన బ్యాగులను తనిఖీ చేయగా సుమారు 10 కేజీల గంజాయి లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి తరలించే వారిపై నిరంతర నిఘా, ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు

- అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి
- విశాఖ ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కేకే రాజు



భోగి మంట వేసి గంగిరెద్దుకు పూజ చేస్తున్న కేకేరాజు



భోగి వేడుకల్లో శాంతినగర్ ప్రజలు

సీతమ్మధార : అందరి జీవితాల్లో సంక్రాంతి పండగ వెలుగులు నింపాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్, పార్టీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో కేకే రాజు ఆధ్వర్యంలో సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కార్యాలయం సమీపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భోగి మంట వేశారు. బసవన్నలకు సారె సమర్పించారు. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. రంగులతో ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండగ అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని ప్రజలకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరం కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, అల్లు శంకరావు, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, కేవీఎన్ శశికళ, స్టాండింగ్ కమిటీ సభ్యులు సేనాపతి అప్పారావు, నాయకులు నీలి రవి, పైడి రమణ, అమర్‌రెడ్డి, హరి పట్నాయక్, బి.గంగా మహేష్, ఐ.రవికుమార్, చిన్న, కిరణ్, నూకరాజు, శేషు, కృపా, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా భోగి

సీతంపేట: తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండగ భోగి మంటల సందడితో వేడుకగా ప్రారంభమైంది. అర్ధరాత్రి నుంచే యువత ఉత్సాహంగా వాడవాడలా భోగిమంటలు వేశారు. నియోజకవర్గంలోని వీధులన్నీ భోగి మంటలతో కళకళలాడాయి. చిన్నా పెద్దా అని తేడా లేకుండా కుటుంబ సమేతంగా అంతా మంటల వద్ద చేరి ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. మధురానగర్, రాజేంద్రనగర్‌లోని అపార్టుమెంట్స్‌లో నివసిస్తున్న కుటుంబాలు అంతా కలిసి ఒకచోట భోగిమంటలు వేసికొని సందడి చేశారు. సీతంపేటలో రాధాకృష్ణ ఆలయం వద్ద, దుర్గా గణపతి ఆలయం వద్ద యూత్ భారీ ఎత్తున మంట వేశారు. సీతంపేట, రామాటాకీస్, గణేష్‌నగర్, రాజేంద్రనగర్, అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, శ్రీనివాసనగర్, లలితానగర్, ఎన్జీవోస్ కాలనీలో భోగి మంటలతో సందడి చేశారు. సాయంత్రం ముత్తైదువులు చిన్నారులకు భోగి పళ్లు పోశారు.

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్‌లో గ్రామపెద్దలు, సీనియర్ సిటిజన్లు ఆదివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేషనల్ పోర్టు ట్రస్టు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు ముఖ్య అతిథిగా పాల్గొని సంబరాలు ప్రారంభించారు. దూది నర్సింగరావు, సన్నిబాబు, రవి, కృష్ణ, శ్రీను, హేమంత్, రవీంద్ర, నాయుడు, శ్రీరాములు, చైతన్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా ధారోత్సవాలు



అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులను ఆలయంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై నాలుగోరోజు ఆదివారం ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకీలో, మరో పల్లకీలో సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారిని, గోదాదేవి అమ్మవారిని తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లను అదిష్టింపజేసి పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం గంగధార వద్ద ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను అదిష్టింపజేశారు. పాశుర విన్నపం పారాయణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముస్లింలకు సీట్లు ఇచ్చే పార్టీలకే మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: వచ్చే ఎన్నికల్లోల ముస్లింలకు ప్రాధాన్యతను ఇచ్చే పార్టీలకు మా మద్దతు ఉంటుందని వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ సభ్యులు తెలిపారు. ఆదివారం రైల్వే న్యూకాలనీలోని ఓ హోటల్‌లో ముస్లిం నేత హైదర్ ఆలీ సింకా అధ్యక్షతన వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు గల నియోజక వర్గాల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా చూస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించే పార్టీలకే తాము మద్దతు ఇస్తామని చెప్పారు. సీట్లు కేటాయించని పక్షంలో ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం నేతలు షేక్‌షరీఫ్, రహమతుల్లా బేగ్, షేక్ మునీర్, షేక్ అహ్మద్ వలీ, హైదర్ ఆలీ సింకా, ముజీబుర్ రెహ్మాన్, అమీర్ జాన్, షేక్ నూర్ అహ్మద్ పలు మసీదుల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో న్యాయవాది మృతి

అల్లిపురం : విపరీతంగా మద్యం తాగటంతో న్యాయవాది మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం రొంకాన శ్రీకాంత్ (41) న్యాయవాద వృత్తి చేస్తున్నారు. ఇతను నాలుగు రోజులుగా ఇంటికి వెళ్లకుండా తన కార్యాలయంలోనే మద్యం తాగుతూ ఉండిపోయారు. ఈ నెల 12వ తేదీన ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లలితాకాలనీలో గల ఆఫీసులో ఉన్నానని సమాధానం చెప్పారు. అతని మామయ్య 13వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అతని కార్యాలయానికి వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. సందులో నుంచి చూడగా కింద పడిపోయి వున్నారు. ఫోన్ చేయగా రింగ్ అవుతున్నా ఫోన్ తీయకపోవటంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అతను ఎంతకీ లేవకపోవటంతో 108కి ఫోన్ చేశారు. వారు చూసి చనిపోయినట్లు తెలిపారు.